సాక్షి
ప్రకాశం
సోమవారం ၊ 29 ၊ జనవరి ၊ 2024



చెప్పాడంటే చేస్తాడంతే..
కొత్తపట్నం మండలంలో 40 ఏళ్ల భూ సమస్యకు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి చొరవ చూపి పరిష్కరించారు. నేడు 217 మందికి 330 ఎకరాలు పంపిణీ చేయనున్నారు.
- 8లో..



పశ్చిమ మణిహారం వెలిగొండ
పశ్చిమ ప్రకాశానికి వెలిగొండ ప్రాజెక్టును మణిహారంగా తీర్చిదిద్దారని వైఎస్సార్ సీపీ యర్రగొండపాలెం ఇన్‌చార్జ్ తాటిపర్తి చంద్రశేఖర్ పేర్కొన్నారు.
- 8లో..

గరిష్టం/కనిష్టం
34/22

వాతావరణం
ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. చల్లని గాలులు వీస్తాయి. పొగమంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు బదిలీ

- నూతన జాయింట్ కలెక్టర్‌గా గోపాలకృష్ణ



బదిలీపై వెళ్లిన జేసీ శ్రీనివాసులు



నూతన జేసీ గోపాలకృష్ణ

ఒంగోలు అర్బన్: జిల్లా జాయింట్ కలెక్టర్‌గా ఉన్న కే శ్రీనివాసులు బదిలీ అయ్యారు. ఆదివారం ఐఏఎస్‌లను బదిలీ చేస్తూ జీవోఆర్‌టీ 172 ద్వారా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జాయింట్ కలెక్టర్‌గా ఉన్న శ్రీనివాసులును నంద్యాల జిల్లా కలెక్టర్‌గా నియమించారు. 2014 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన శ్రీనివాసులు బాపట్ల జిల్లా జాయింట్ కలెక్టర్‌గా చేస్తూ 2023 ఏప్రిల్ 23వ తేదీ ప్రకాశం జిల్లా జాయింట్ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు. తొమ్మిది నెలల కాలంలో జాయింట్ కలెక్టర్‌గా రీసర్వే, ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలకు భూ సేకరణ, పంట ఉత్పత్తుల కొనుగోలు వంటి వాటిలో తనదైన శైలితో పనిచేసి సత్ఫలితాలు సాధించారు. అంతేకాకుండా చుక్కల భూములు, అసైన్‌మెంట్ భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించడంలో తనదైన పాత్ర పోషించారు. జిల్లా నూతన జాయింట్ కలెక్టర్‌గా 2017 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన గోపాలకృష్ణ రోనంకిని నియమించారు. ఇప్పటి వరకు సర్వే అండ్ సెటిల్‌మెంట్, ల్యాండ్ రికార్డ్స్ (ఎస్‌ఎస్ అండ్ ఎల్‌ఆర్) అడిషనల్ డైరెక్టర్‌గా ఉన్న గోపాలకృష్ణను జిల్లా జాయింట్ కలెక్టర్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు పంపిణీ



ఉపాధ్యాయుడు హనుమంతరావుకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేస్తున్న బాలినేని

ఒంగోలు: అనారోగ్యానికి గురై శస్త్ర చికిత్స చేయించుకున్న ఉపాధ్యాయుడు కొప్పోలు హనుమంతరావుకు మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి అండగా నిలిచారు. హనుమంతరావు లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ చికిత్స చేయించుకోవాల్సి వచ్చింది. ఈ నేపథ్యంలో అత్యవసర చికిత్స చేయించుకున్న ఆయన అనంతరం ఎమ్మెల్యే బాలినేనిని కలిసి తన సమస్యను వివరించాడు. దీంతో బాలినేని ముఖ్యమంత్రి సహాయ నిధి పరిశీలన కోసం పంపారు. దీంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి స్పందించి సీఎం సహాయ నిధి ద్వారా రూ.20 లక్షలు మంజూరు చేశారు. సంబంధిత చెక్కును ఆదివారం తన నివాసంలో బాలినేని శ్రీనివాసరెడ్డి ఉపాధ్యాయుడు కొప్పోలు హనుమంతరావుకు అందజేశారు. ఈ సందర్భంగా బాలినేనికి ఉపాధ్యాయుడు హనుమంతరావు కృతజ్ఞతలు తెలిపారు. హనుమంతరావు ప్రస్తుతం కొత్తపట్నం మండలం అల్లూరు ఎంపీపీఎస్ సీఈ పాఠశాల ఉపాధ్యాయునిగా విధులు నిర్వహిస్తున్నారు.

పాడిరైతుకు భరోసా

పాడి రైతులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అండగా నిలుస్తున్నారు. ప్రతి ఒక్కరికీ మెరుగైన వైద్యం ఉచితంగా అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇప్పటికే ఆరోగ్య కార్డులు అందజేస్తున్న ప్రభుత్వం మనుషుల మాదిరిగానే మూగ జీవాలకు కూడా ఆరోగ్య కార్డులు అందజేసేందుకు చర్యలు తీసుకుంది. ఈ కార్డులో రైతు పేరు, ఊరు, వైద్య సేవలు అందించిన చికిత్సల వివరాలు అందులో పొందుపరుస్తారు. తద్వారా భవిష్యత్‌లో ఎప్పుడైనా పశువులు రోగాల బారిన పడితే వాటి గత ఆరోగ్య చరిత్ర తెలుసుకోవడం ద్వారా సులువుగా వైద్యం అందించేందుకు పశువైద్యులకు వీలు కలుగుతుంది.



పశువైద్య కార్డులతో పశుపోషకులు

- పశు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ
- పశువులకు హెల్త్ కార్డులు
- జిల్లాలో గేదెలు, ఆవులు, జీవాల యజమానులు మొత్తం 2,84,036 మంది
- 2,20,747 మందికి హెల్త్‌కార్డులు అందజేత

ఒంగోలు సెంట్రల్: వైఎస్సార్‌సీపీ అధికారంలోనికి వచ్చిన వెంటనే పశువులకు నాణ్యమైన సేవలు అందించటానికి గ్రామాల్లోనే రైతు భరోసా కేంద్రాలు (ఆర్‌బీకే)లు ఏర్పాటు చేసి, పశువైద్యులను నియమించారు. జిల్లాలో 12 నియోజకవర్గాల్లో పశు అంబులెన్స్‌లను ఏర్పాటు చేశారు. ఏ సమయంలో అయినా టోల్ ఫ్రీ నంబర్ 1962కు కాల్ చేస్తే రైతు ముంగిటనే పశు వైద్యం అందేలా చర్యలు తీసుకుంటున్నారు. ఈ క్రమంలో పాడి రైతులకు మరింత మేలు చేకూరేలా వారి పశువులకు హెల్త్ కార్డులు జారీ చేస్తున్నారు. జిల్లాలో గేదెలు, ఆవులు, జీవాల యజమానులు మొత్తం 2,84,036 మంది ఉండగా, అందులో 2,20,747 మందికి (77.71 శాతం) హెల్త్ కార్డులు అందజేశారు. అందులో గేదెలు, ఆవుల యజమానులు 1,84,800 మంది ఉండగా, ఇప్పటి వరకు 1,22,331 మందికి హెల్త్ కార్డులు అందించారు. జీవాల యజమానులు 99,236 మంది ఉండగా, 98,416 మందికి కార్డులు పంపిణీ చేశారు.



ఆన్‌లైన్‌లో వివరాలు పరిశీలిస్తున్న ఆశాఖ జేడీ బేబిరాణి (ఫైల్)

ఉపయోగాలెన్నో...
పశువులకు ప్రభుత్వం ఇస్తున్న హెల్త్ కార్డులతో ఎన్నో ఉపయోగాలు ఉన్నాయి. ఆరు ఆవులు, గేదెలకు ఒకటి చొప్పున, 20 గొర్రెలు, మేకలు ఉంటే ఒకటి చొప్పున యజమానులకు హెల్త్ కార్డులు అందిస్తున్నారు. జిల్లాలో ఇప్పటికే పశు వైద్యకార్డులు పంపిణీ చేశారు. ఈ కార్డులో రైతు పేరు, ఊరు, వైద్య సేవలు అందించిన చికిత్సల వివరాలు అందులో పొందుపరుస్తారు. ఆరోగ్య సంరక్షణ చర్యలు, కృత్రిమ గర్భధారణ తదితర వివరాలు నమోదు చేస్తారు. దీని వలన భవిష్యత్‌లో ఎప్పుడైనా పశువులు రోగాల బారిన పడితే వాటి గత ఆరోగ్య చరిత్ర తెలుసుకోవడం ద్వారా సులువుగా వైద్యం అందించేందుకు పశువైద్యులకు వీలు కలుగుతుంది. హెల్త్‌కార్డులో పశువులు, జీవాలకు వచ్చే రోగాలు–నివారణ చర్యలు కూడా ముద్రించారు. దీంతో రైతులే తమ పశువులకు సొంతంగా మందులు అందించి ఉపశమనం పొందవచ్చు. ఈ కార్డుల ఆధారంగా పశువుల సంఖ్య, వాటికి కావాల్సిన మందులు వంటి విషయాలు తెలుసుకోవచ్చు. ఇతర అంశాలకు సంబంధించి కూడా ప్రయోజనాలు ఉన్నాయని పశుసంవర్థక శాఖ అధికారులు పేర్కొంటున్నారు. ఆరోగ్య కార్డుల జారీ వలన సంబంధిత శాఖకు, ఇటు రైతులకు ఉపయుక్తంగా ఉంటుందని అధికారులు అంటున్నారు.

ఆరోగ్య కార్డు గుర్తింపు ఇస్తారిలా...
అన్ని మూగ జీవాల వివరాలు ఆన్‌లైన్ చేసి హోలోగ్రాంతో కూడిన పది అంకెల సంఖ్యలో పొందుపరచి గుర్తింపు ఇస్తున్నారు. ఈ హోలోగ్రామ్‌ను స్కాన్ చేసినప్పుడు ఆ నంబర్‌తో ఎన్ని జీవాలు ఉన్నాయి. రైతు ఎవరు, పశువులకు ఎటువంటి వ్యాధులు ఉన్నాయి తదితర వివరాలతో కూడిన సమాచారం తెలుస్తోంది. పశువైద్యశాఖ ప్రతి పశువుకు కార్డు ఇవ్వకుండా ఆరు పశువులకు (పెద్ద జీవాలకు) ఒక ఆరోగ్య గుర్తింపు కార్డు తయారు చేసి ఇస్తోంది. ఇక 20 జీవాలకు ఒక ఆరోగ్యకార్డును అందిస్తున్నారు. ఇందులో పూర్తి సమాచారం పొందుపరుస్తున్నారు.

జిల్లాలో పశుసంపద వివరాలు

తెల్ల పశువులు	56,332
నల్ల పశువులు	6,71,812
గొర్రెలు	15,67,122
మేకలు	4,17,589

పశు హెల్త్‌కార్డులు అందుకున్న యజమానుల సంఖ్య వివరాలు

లక్ష్యం		ఇచ్చినవి	
ఆవులు, గేదెలు	జీవాలు	ఆవులు, గేదెలు	జీవాలు
1,84,800	99,236	1,22,331	98,416
మొత్తం : 2,84,036		2,20,747	

మంచి కార్యక్రమం



పశుఆరోగ్య సంరక్షణ కార్డు రైతులందరికీ ఎంతో ఉపయోగపడుతుంది. పశువులు, గొర్రెలు, మేకలకు వైద్యం, వైద్య వివరాలు తెలుసుకునే వీలు కలుగుతుంది. రైతులందరికీ పంపిణీ చేస్తున్నారు. అన్ని సేవలూ ఉచితంగా పొందుతున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక పాడి రైతులకు ఇబ్బందులు తప్పాయి.
– సుమతి, వినలాపురం, తాళ్లూరు మండలం

సద్వినియోగం చేసుకోవాలి



జిల్లాలోని ఆర్‌బీకేల్లో పశువైద్య సిబ్బంది అందుబాటులో ఉంటున్నారు. ప్రభుత్వ సేవలను ప్రతి రైతూ సద్వినియోగం చేసుకోవాలి. పశువుల హెల్త్ కార్డులు భద్రంగా ఉంచుకోవాలి. ఈ కార్డుల ద్వారా పశువులు, జీవాలకు అందించే వైద్యం గురించి తెలుసుకోవచ్చు. రైతులే సొంతంగా మందులు అందించుకోవచ్చు. ఆరోగ్యకార్డుల్లోని వివరాలను సిబ్బంది రిజిస్టర్ చేస్తారు. పశుగణన, వ్యాధుల నిర్ధారణ, ప్రభుత్వం నుంచి అందించే ఉచిత మందులు, టీకాల వివరాలు, పశు బీమా ఇలా ప్రతి దానికి పశు ఆరోగ్య సంరక్షణ కార్డులు ఉపయోగపడతాయి.
– బేబీ రాణి, జేడీ, పశుసంవర్ధక శాఖ, ఒంగోలు

నేడు నిధి ఆప్‌కే నిఖత్ వార్షిక కార్యక్రమం

ఒంగోలు: ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ ఆధ్వర్యంలో సోమవారం ఉదయం 10 గంటలకు స్థానిక ప్రకాశం జిల్లా సహకార కేంద్ర బ్యాంకు కార్యాలయం సమావేశ మందిరంలో 'నిధి ఆప్‌కే నిఖత్' వార్షిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ జిల్లా నోడల్ ఆఫీసర్ ఎం.సమ్మయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని వివిధ సంస్థల్లో పనిచేస్తున్న కార్మికులు, పెన్షనర్లు పీఎఫ్ సంబంధిత సమస్యలను గత ఏడాది జనవరి 27 మొదలు ఇప్పటి వరకు నిధి ఆప్‌కే నిఖత్ కార్యాలయం ద్వారా త్వరితంగా పరిష్కరించారన్నారు. ఈ కార్యక్రమం ఏడాదిపాటు దిగ్విజయంగా జరిగినందున వార్షిక వేడుకను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వివిధ సంస్థల యజమానులు, కార్మికులు, పెన్షనర్లు, పీఎఫ్ సంబంధిత సమస్యలను తెలియజేస్తే వెంటనే వాటిని పరిష్కరించేందుకు తగు చర్యలు తీసుకుంటామని చెప్పారు. జిల్లాలోని అన్ని ప్రైవేటు పాఠశాలల యాజమాన్య సంఘాలు, పాఠశాలల యాజమాన్యాలు ఈ సమావేశంలో పాల్గొనాల్సిందిగా విజ్ఞప్తి చేశామన్నారు. ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ చేపడుతున్న వివిధ ఆన్‌లైన్ సేవల గురించి వివరంగా తెలియజేస్తారన్నారు.

30న రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ చాంపియన్‌షిప్

టంగుటూరు: ఈ నెల 30న టంగుటూరు మండలం జమ్ములపాలెం హైస్కూలులో రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ చాంపియన్ షిప్ పోటీలు నిర్వహిస్తారని జిల్లా అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ పీ సురేష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ రాష్ట్రంలోని ఉమ్మడి 13 జిల్లాల నుంచి సీనియర్స్, అండర్ 20, 15 స్థాయి క్రీడాకారులు రాష్ట్ర స్థాయి చాంపియన్ షిప్ ట్రోఫీలో పాల్గొంటారు. గెలుపొందిన సీనియర్ క్రీడాకారులు రాజస్థాన్‌లోని జైపూర్‌లో ఫిబ్రవరి 1 నుంచి 5 వరకు జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారు. అలాగే అండర్ 20, 15 ల్లో గెలుపొందిన క్రీడాకారులకు మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్‌లో జాతీయ స్థాయి పోటీల్లో ఫిబ్రవరి 11 నుంచి 17 వరకు జరిగే పోటీల్లో పాల్గొంటారు. టోర్నమెంట్ తుల్లిబిల్లి అశోక్‌బాబు ఆధ్వర్యంలో నిర్వహిస్తారని, క్రీడా పోటీల్లో పాల్గొనే విద్యార్థులకు ఉచిత భోజన వసతి సౌకర్యాలు కల్పిస్తారన్నారు. ఈ రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీలు ప్రకాశం జిల్లా అమర్పూర్ రెజ్లింగ్ అసోసియేషన్, ఏపీ రెజ్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తారన్నారు.

ఉద్యోగులకు అండగా ఉంటా

- ప్రతి రెండో శనివారం లేదా ఆదివారం ఉద్యోగుల సమస్యలపై ప్రత్యేక సమావేశం
- ఉద్యోగుల ఆత్మీయ సమావేశంలో మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి



మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే, బాలినేని శ్రీనివాసరెడ్డి

ఒంగోలు: ఉద్యోగులకు అండగా ఉంటానని, అదే విధంగా ఉద్యోగులు కూడా రాబోయే ఎన్నికల్లో తనకు అండగా ఉండాలని మాజీమంత్రి, స్థానిక ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి కోరారు. ఆదివారం స్థానిక తన నివాసంలో ఉద్యోగ, ఉపాధ్యాయులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యోగులు తమ సమస్యల పరిష్కారానికి కనీసం నెలలో ఒకటి రెండు రోజులు అయినా ప్రత్యేకంగా సమావేశానికి అవకాశం కల్పించాలని కోరారు. ఉద్యోగుల సమస్యలను కూడా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ తమ ఇంటికి ఏక్షణంలో అయినా నేరుగా వచ్చేందుకు అవకాశం ఉంటుందని, తప్పకుండా అండగా ఉంటామన్నారు. కేవలం తామే కాకుండా తమ కుటుంబ సభ్యులు, మిత్రులతో కూడా కలిసి వచ్చే ఎన్నికల్లో మరోమారు ఎమ్మెల్యేగా గెలిపించుకునేందుకు కృషి చేస్తామన్నారు. అనంతరం బాలినేని శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ప్రతి నెలలో రెండో శనివారం లేదా ఆదివారం ప్రత్యేకంగా ఉద్యోగ, ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహిస్తామన్నారు. ఎప్పటికప్పుడు తన దృష్టికి వచ్చిన సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని చెప్పారు. ప్రస్తుతం ఉద్యోగులు ప్రస్తావించిన సమస్యలను ఈనెల 30న సీఎం దృష్టికి తీసుకువెళ్లనున్నట్లు తెలిపారు. తన వద్దకు పార్టీలకు అతీతంగా ఏ ఉద్యోగి, ఉపాధ్యాయుడు వచ్చినా పనిచేసి పెట్టానే తప్ప వివక్ష చూపిన దాఖలాలు లేవన్నారు. చివరిసారిగా తాను పోటీచేసే సార్వత్రిక ఎన్నికల్లో మళ్లీ తనను గెలిపించాలని, అందుకు సహకరించాలని కోరారు. సమావేశంలో వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కె.జాలిరెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక సలహాదారు కాకి కృపారావు, ఉపాధ్యాయ సంఘం నాయకులు నరహరి అంజిరెడ్డి, వైఎస్సార్ పీటీడీ ఉద్యోగుల సంఘం నాయకులు ఆవుల రాధాకృష్ణ, ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం ఉపాధ్యాయ సంఘం నాయకులు డి.వెంకటేశ్వరరెడ్డి, విద్యుత్ ఉద్యోగుల సంఘం నాయకులు సురేష్, మున్సిపల్ ఉపాధ్యాయ సంఘం నాయకులు ప్రసాద్, ఎన్‌జీవో సంఘం నాయకులు కొత్తపల్లి మంగేష్, జెడ్పీ ఉద్యోగుల సంఘం నాయకులు విద్యా సాగర్‌రెడ్డి, హౌసింగ్ ఉద్యోగుల సంఘం నాయకులు మస్తాన్, డాక్టర్ల సంఘం నాయకులు డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, వెటర్నరీ డాక్టర్ల సంఘం నాయకుడు భూపాల్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాస రెడ్డి, పక్కన మేయర్ గంగాడ సుజాత

పేదల ఇళ్లకు సైంధవుడిలా అడ్డుపడుతున్నాడు..

- 75 వేల మందితో దామచర్ల ఇంటిని ముట్టడిస్తా
- టీడీపీ నాయకుల కుట్రలు మొత్తం పేదలను ఇబ్బంది పెట్టడమే
- రైతుల పొలాలు కొనుగోలు చేసి పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని నిర్ణయించాం
- అయినా ఇంకా అడ్డుకోవాలని దామచర్ల యత్నం
- ఆసరా వేడుకల్లో మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి



సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బాలినేని, మేయర్ గంగాడ సుజాత

ఒంగోలు సబర్బన్: పేదలకు ఇళ్లు ఇద్దామని పూనుకుంటున్న ప్రతిసారీ టీడీపీ నాయకులు, మరీ ముఖ్యంగా మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ సైంధవుడిలా అడ్డుపడుతున్నాడని ఇంకా అదే పనిగా పెట్టుకొని అడ్డుపడితే 75 వేల మందితో దామచర్ల ఇంటిని ముట్టడిస్తానని మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాస రెడ్డి హెచ్చరించారు. ఒంగోలు నగర పాలక సంస్థ కార్యాలయ ప్రాంగణంలో ఆదివారం నిర్వహించిన జగనన్న ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. టీడీపీ నాయకులు అడుగడునా అడ్డంకులు సృష్టించటం పనిగా పెట్టుకున్నారని బాలినేని ధ్వజమెత్తారు. ''ఒంగోలులో ఇళ్లులేని నిరుపేదలకు ఇళ్లపట్టాలు ఇద్దామని నిర్ణయించి ప్రభుత్వ భూమి ఉందని యరజర్ల వద్ద ఒకే చోట 25 వేల మందికి పట్టాలు ఇచ్చేందుకు 800 ఎకరాలకు పైగా చదును చేసి బాగు చేయించాం. అది ఒక పెద్ద టౌన్‌షిప్ అవుతుందని భావించిన దామచర్ల కోర్టుకు వెళ్లి మరీ ఆ ఇళ్ల పట్టాలు ఆపేయించాడు. దీంతో పట్టాల పంపిణీ ఆలస్యమైంది. ఆ తరువాత సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లాను. యరజర్ల స్థలం కోర్టులో పెండింగ్ ఉందికాబట్టి ప్రైవేటు స్థలాలు కొనుగోలు చేసి అయినా ఇద్దామని సీఎం వైఎస్ జగన్ హామీ ఇచ్చారు. అధికారులను పరుగులు తీయించాం. పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాల్సిందే అని పట్టుబట్టా. దాదాపు 500 ఎకరాల వరకు కొనుగోలు చేసి రూ.210 కోట్లు ప్రభుత్వం నుంచి విడుదల చేసేందుకు పూనుకున్నా. మొదటి దశగా రూ.30 కోట్లు విడుదల చేశారు. అయితే డబ్బులు పూర్తిగా వచ్చే వరకూ నా రాజకీయ జీవితాన్ని ఫణంగా పెట్టిమరీ పట్టుబట్టాను. రైతులకు పూర్తిగా డబ్బులు పడిన తరువాతనే ఒంగోలు వస్తానని, పేదలకు ఇళ్ల పట్టాలు ఇస్తేనే రానున్న 2024 అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తానని కూడా ఒంగోలు నగర ప్రజలకు మాటిచ్చాను. ఆ మాట మేరకు సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వద్ద పట్టుబట్టి మరీ నిధులు విడుదల చేయించుకొని వస్తే ఆ భూములను అభివృద్ధి చేయటానికి వచ్చే కాంట్రాక్టర్‌ను బెదిరించి మరీ పేదల ఇళ్ల పట్టాలు ఇవ్వకుండా చేయటానికి దామచర్ల ఇంకా కుట్రలు పన్నుతున్నాడని'' బాలినేని ధ్వజమెత్తారు. అదే జరిగితే 25 వేల మంది పేదలు అంటే ఒక్కో ఇంట్లో కనీసం ముగ్గురు ఉంటారని అంటే దాదాపు 75 వేల మందితో జనార్దన్ ఇంటిని ముట్టడిస్తానని హెచ్చరించారు. ఫిబ్రవరి 10వ తేదీ నుంచి 15వ తేదీ లోపు సీఎం వైఎస్ జగన్ జిల్లాకు వస్తున్నారని, ఆయన చేతుల మీదుగా ఇళ్ల పట్టాలు ఇచ్చే కార్యక్రమాన్ని చేపడతామని పేదలకు బాలినేని భరోసా ఇచ్చారు.. ఎవరికైతే ఇంటి భరోసా పత్రాలు ఇచ్చామో అందరికీ ఇళ్ల పట్టాలు ఇవ్వటంతో పాటు ఇళ్లు కట్టించి ఆదుకుంటామన్నారు. ఇళ్ల పట్టాలతో పాటు ప్రతి మహిళకు చీర పెట్టి మరీ ఆదరిస్తామన్నారు. త్వరలో ప్రతి డివిజన్‌లో తిరుగుతానని.. ఏదైనా సమస్యల వల్ల పింఛన్లు అందకపోయినా, ఇళ్ల పట్టాలకు దరఖాస్తు చేసుకోలేక పోయిన వారు దరఖాస్తు చేసుకుంటే మంజూరు చేయించేందుకు కృషి చేస్తానన్నారు. ఇబ్బందులు ఉన్న వారికి సొంతగా అయినా పింఛన్లు అందజేస్తాన న్నారు. ఈ సందర్భంగా ఒంగోలు నగర పాలక సంస్థ పరిధిలో 2,880 సంఘాలకు 27,879 మంది మహిళలకు ఆసరా నాలుగో విడత కింద రూ.24,56,37,320 విలువైన చెక్కును అందజేశారు. కార్యక్రమంలో ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత ఆసరా కార్యక్రమానికి అధ్యక్షత వహించి నిర్వహించారు. కార్యక్రమంలో ఒంగోలు నగర కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావుతో పాటు డిప్యూటీ మేయర్లు పాల్గొన్నారు.

కొండపిలో గెలుపు నల్లేరు మీద నడకే

- పురపాలక, పట్టణాభివృద్ధి శాఖామంత్రి ఆదిమూలపు సురేష్
- పొన్నలూరులో పార్టీ సమావేశంలో కార్యకర్తలకు దిశానిర్దేశం
- వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యంగా పని చేయాలని పిలుపు

పొన్నలూరు: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో కొండపి నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ గెలుపు నల్లేరు మీద నడకే అని పురపాలక, పట్టణాభివృద్ధి శాఖామంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ పేర్కొన్నారు. పొన్నలూరులో ఆదివారం కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేసి పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మంత్రి సురేష్ మాట్లాడుతూ కొండపి నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో పార్టీ బలంగా ఉందని, చిన్న చిన్న సమస్యలు, భేదాభిప్రాయాలను పక్కన పెట్టి వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త, నాయకుడు పనిచేయాలని పిలుపునిచ్చారు. నియోజకవర్గంలో ఎలాంటి గ్రూపులు లేవని, ఉన్నది ఒకటే గ్రూపు అని అది జగనన్న గ్రూపు మాత్రమే అన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వెనుకబడిన కొండపి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడానికి పూనుకున్నారని, అందులో భాగంగానే సమన్వయకర్తగా నన్ను నియమించారని, అందరినీ కలుపుకొని ముందుకు పోతానని మంత్రి సురేష్ అన్నారు. కొండపి నియోజకవర్గానికి నన్ను సమన్వయకర్తగా నియమించగానే చంద్రబాబు దగ్గర నుంచి కింది స్థాయి నాయకుల వరకు నాపై ఓటమి భయంతో పసలేని మాటలు మాట్లాడుతున్నారన్నారు. ఇలాంటి మాటలు పట్టించుకోవాల్సిన అవసరం లేదని, కాలమే ప్రతిపక్షపార్టీ నాయకులకు సమాధానం చెబుతుందన్నారు. ఐక్యతకు మారుపేరు వైఎస్సార్ సీపీ కార్యకర్తలని, ప్రతిపక్ష పార్టీలు, ఎల్లో మీడియా చేసే అసత్య ప్రచారాలను కొండపి నియోజకవర్గంలో పార్టీ శ్రేణులు చైతన్యంతో పనిచేసి తిప్పికొట్టాలన్నారు. వైఎస్సార్‌సీపీకి కార్యకర్తలే బలమని, ప్రతి కార్యకర్తకు అండగా ఉండి, నిరంతరం వారి అభివృద్ధికి పనిచేస్తానని మంత్రి సురేష్ అన్నారు. చరిత్రను తిరగరాసే క్రమంలో కొండపి నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు అకుంఠిత దీక్షతో ముందుకు సాగాలన్నారు.

జగనన్న పోరాటం పేదరికం నిర్మూలనకే...
రాష్ట్రంలో జగనన్న పోరాటం టీడీపీ, ప్రతి పక్ష పార్టీల మీద కాదని, జగనన్న పోరాటం పేదరికం లేని గ్రామాల కోసం పనిచేస్తున్నారన్నారు. అందుకనే పార్టీలకు, కులాలకు, మతాలకు, ప్రాంతాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందజేస్తున్నారన్నారు. పేదరికాన్ని రూపుమాపడానికే సీఎం జగన్ మోహన్‌రెడ్డి రూ.2.80 లక్షల కోట్లను ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరేలా డీబీటీ పద్ధతిలో అవినీతికి తావులేకుండా పథకాల రూపంలో లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాలకు జమ చేశారన్నారు.



పొన్నలూరులో మాట్లాడుతున్న మంత్రి ఆదిమూలపు సురేష్

ఓటమి భయంతోనే పొత్తులు, కుయుక్తులు:
వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ఓటమి భయంతోనే చంద్రబాబు పొత్తులు, కుయుక్తులు పన్నుతున్నారన్నారు. పవన్ కల్యాణ్ జనసేన పార్టీని టీడీపీకి తాకట్టు పెట్టడం వలన జనసేన కార్యకర్తలు అసహనం వ్యక్తం చేస్తున్నారన్నారు. పార్టీపెట్టి మరొకరిని ముఖ్యమంత్రి చేయడానికి పనిచేసే ఏకైక వ్యక్తి ఒక్క పవన్‌కల్యాణ్ మాత్రమే అన్నారు. జగనన్నపై కుట్రలకు తెరతీసే కాంగ్రెస్ అధిష్టానం, చంద్రబాబు చీకటి ఒప్పందం చేసుకొని షర్మిలను తెరపైకి తెచ్చారన్నారు. వారి కుటుంబంలో చిచ్చుపెట్టి లబ్ధిపొందాలని చూస్తున్నారన్నారు. ఎన్ని కుట్రలు, కుయుక్తులు పన్నినా, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేసిన మంచి పనులే మరోసారి ఆయనను ముఖ్యమంత్రి చేస్తాయన్నారు. గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ శ్రేణులు అప్రమత్తంగా ఉండి చివరి వరకు పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బెజవాడ వెంకటేశ్వర్లు, ఎంపీపీ కొండాబత్తిన మాధవరావు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పల్లపోలు బాలకోటిరెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ పిల్లి తిరుపతిరెడ్డి, ప్రచార కమిటీ జిల్లా కార్యదర్శి పెరుగు కోటేశ్వరరావు, జిల్లా ఎస్టీ సెల్ సభ్యురాలు ఇండ్లా శీనమ్మ, జిల్లా అధికార ప్రతినిధి రాజాల ఆదిరెడ్డి, మాజీ ఎంపీపీ గోపిరెడ్డి ఈశ్వర్‌రెడ్డి, మాజీ మండల కన్వీనర్ పల్నాటి వెంకటేశ్వరరెడ్డి, మాజీ సర్పంచ్ ముళ్ళమూరి వెంకటేశ్వర్లు, కంచర్ల రవణయ్య, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రేమికుడు బలవన్మరణం

● ప్రేమ విఫలమవడంతో మనస్తాపం



నరేంద్రబాబు (ఫైల్)

మార్కాపురం రూరల్: ప్రేమ విఫలం కావడంతో యువకుడు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆదివారం మధ్యాహ్నం మార్కాపురం మండలంలోని జంకె రామిరెడ్డి నగర్‌లో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కురిచేటి నరేంద్ర బాబు (22) డిగ్రీ వరకు చదివి ప్రస్తుతం ఉద్యోగ ప్రయత్నాల్లో ఉన్నాడు. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన ఓ యువతిని ప్రేమించాడు. ఆమెను పెళ్లి చేసుకుంటానని తల్లిదండ్రులను అడుగగా వారు నిరాకరించి, రాత్రికి రాత్రే మరో యువకుడితో ఆమెకు నిశ్చితార్థం చేశాడు. దీంతో మనస్తాపం చెందిన నరేంద్రబాబు తన ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతదేహాన్ని మార్కాపురం జిల్లా వైద్యశాలకు తరలించి పోస్టుమార్టం నిర్వహించనున్నట్లు తెలిపారు. మార్కాపురం రూరల్ ఎస్సై వెంకటేశ్వర నాయక్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లారీ బోల్తా.. తప్పిన పెను ప్రమాదం



బోల్తా పడిన లారీ

ముండ్లమూరు: మండలంలోని రమణారెడ్డి పాలెం వద్ద మొక్కజొన్న లోడుతో వెళ్తున్న లారీ అదుపుతప్పి ఎన్ఎస్‌పీ కాలువలో పడింది. డ్రైవర్ దాచేపల్లి గురవయ్య, క్లీనర్ త్రుటిలో ఈ ప్రమాదం నుంచి బయట పడ్డారు. ఆదివారం ఈదర గ్రామంలో మొక్క జొన్నలు లోడ్ చేసుకొన్న లారీ చిత్తూరుకు బయలుదేరింది. మార్గ మధ్యంలో రమణారెడ్డిపాలెం వద్ద మలుపు వద్ద అదుపుతప్పి సాగర్ కాలువలో పడింది. లారీలో ఉన్న డ్రైవర్, క్లీనర్ స్వల్ప గాయాలతో బయట పడ్డారు.

బంగారు ఆభరణాల చోరీ



దొంగతనం జరిగిన బీరువా వద్ద చెల్లాచెదురుగా పడిన వస్తువులు


దర్శి: పట్టణ పరిధిలోని శివరాజ్‌నగర్‌లో శనివారం రాత్రి ఓర్సు శైలజ ఇంటిలో జరిగిన చోరీ ఘటనపై ఆదివారం కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ రాంబాబు తెలిపారు. పోలీసులు, బాధిత మహిళ తెలిపాన వివరాలు.. శైలజ శనివారం ఉదయం ఒంగోలు హాస్పిటల్‌కి బయలుదేరి వెళ్లింది. అదే రోజు రాత్రి ఇంటికి చేరుకొనే సరికి ఇంటి తాళాలు పగులగొట్టి ఉన్నాయి. బీరువాలోని చీరలు, వస్తువులు చెల్లా చెదురుగా పడి ఉన్నాయి. దీంతో గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లో చోరీకి పాల్పడినట్లు గుర్తించారు. బీరువాలో దాచిన ఏడు సవర్ల బంగారు ఆభరణాలు, ఆరు వేల నగదు అపహరించుకు పోయినట్లు శైలజ స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ తెలిపారు. దర్యాప్తులో భాగంగా ఒంగోలు నుంచి క్లూస్ టీం రప్పించి దొంగలను గుర్తించే ప్రయత్నం చేశారు.

చెప్పాడంటే చేస్తాడంతే!

● 40 సంత్సరాల భూ సమస్యకు పరిష్కారం చూపిన ఎమ్మెల్యే బాలినేని
● నేడు 217 మందికి 330 ఎకరాల పంపిణీ
● హర్షం వ్యక్తం చేస్తున్న ఉప్పు రైతులు



సర్వే నంబర్ 522/ఏలో సాగు చేస్తున్న ఉప్పు



ఉప్పు కొఠారుల్లో ఉప్పు తీస్తున్న దృశ్యం

కొత్తపట్నం: సుమారు 40 ఏళ్ల నుంచి వివాదంలో ఉన్న భూ సమస్యకు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాస రెడ్డి పరిష్కారం చూపడంతో రైతుల్లో హర్షాతిరేకాలు మిన్నంటాయి. ఇప్పటి వరకు ఏ నాయకుడూ చేయలని పనిని ఆయన చేయడం గమనార్హం. ఈ మేరకు లబ్ధిపొందనున్న 217 మంది ఉప్పు రైతులకు సోమవారం పట్టాలతో పాటు పాస్ బుక్‌లను కూడా బాలినేని మంజూరు చేయనున్నారు.

మండల పరిధిలోని దేవరంపాడు రెవెన్యూ పరిధిలో సర్వే నంబర్ 522/ఏలో 330 ఎకరాలున్నాయి. 40 ఏళ్ల క్రితం మోటుమాల గ్రామస్తులు ఈ భూముల్లో చిల్ల చెట్లు, గుంతలు, వాగులు పూడ్చించి చదును చేసుకున్నారు. అనంతరం ఉప్పు నీరు బోర్లు వేసి ఉప్పు సాగుబడి మొదలు పెట్టారు. కానీ అదే సమయంలో ఇంకొల్లు మండలానికి చెందిన భీమవరం గ్రామస్తులు ఈ భూమి తమదంటూ వివాదానికి తెరలేపారు. మొటుమాల గ్రామస్తులను సాగు చేసుకోనీయకుండా అడ్డుపడుతూ వస్తుండటంతో ఇరువర్గాల మధ్య అప్పటి నుంచి వివాదం నెలకొంది. అనంతరం

వారు హైకోర్టును ఆశ్రయించినా ఇద్దరికీ అనుకూలమైన తీర్పు రాలేదు. ఈ క్రమంలో బాలినేని శ్రీనివాసరెడ్డి రంగంలోకి దిగారు. వారిని పిలిపించి మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేశారు.

అభాసుపాలైన మాజీ ఎమ్మెల్యే దామచర్ల

2014 ఎన్నికల్లో ఎమ్మెల్యేగా ఎన్నికైన దామచర్ల జనార్దన్ ఈ సమస్య పరిష్కరిస్తానంటూ నమ్మబలికారు. కార్యకర్తలు, అధికారులతో ఉప్పు కొఠారుల వద్దకు చేరుకుని హడావిడి చేశారు. అయితే ప్రగల్భాలే మిగిలాయి కానీ.. పని మాత్రం జరగలేదు.

నేడు పండగ వాతావరణం

ఇప్పటి వరకు వివాదంలో ఉన్న మోటుమాల గ్రామస్తులకు 522/ఏలో వారు సాగు చేసుకుంటున్న 330 ఎకరాలకు పట్టాలతో పాటు పాస్ బుక్‌లను కూడా సిద్ధం చేశారు. వీటిని 217 మందికి మాజీ మంత్రి, ఎమ్మెల్యే బాలనేని శ్రీనివాసరెడ్డి చేతుల మీదుగా సోమవారం పంపిణీ చేయనున్నారు. అదే సమయంలో భీమవరం గ్రామానికి చెందిన రైతులకు కూడా మిగులు భూమలు పంపిణీ చేయనుండటంతో ఇరువర్గాల వారు బాలినేనికి కృతజ్ఞతలు తెలిపారు. ఆయన మాట ఇస్తే నెరవేర్చుతారని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

జీవితంలో మర్చిపోని సంఘటన



సర్వే నంబర్ 522/ఏలో 2 ఎకరాలు సాగు చేసుకుంటున్నా. ఎటువంటి ఆధారం లేక, ప్రభుత్వం నుంచి వచ్చే రాయితీలు పొందక ఇబ్బంది పడుతున్నాం. కోర్టులో ఉండి పోరాడుతున్నాం. ఉంటుందా, ఊడి పోతుందా అని ఎంతో మనస్థాపం చెందేవాళ్లం. కోర్టులో ఉన్న దానిని బాలిననేని శ్రీనివాసరెడ్డి పరిష్కరించి ఈ రోజు పట్టాలు పంపిణీ చేయటం ఎంతో ఆనందంగా ఉంది.

– పురిణి శ్రీనివాసరెడ్డి, మోటుమాల

సమయం అనుకూలించింది, సమస్య పరిష్కరించా..



నేను 5 సార్లు ఎమ్మెల్యే అయ్యా. ఈ సమస్య అప్పటి నుంచి వెంటాడుతూనే ఉంది. నేను మోటుమాల గ్రామానికి వెళ్లినప్పుడల్లా ఇదే సమస్యను పదే పదే అడిగేవారు. కోర్టులో ఉన్నందున నేను ఏమీ చేయలేక పోయా. ఇప్పుడు సమయం వచ్చింది. సమస్యకు శాశ్వతంగా పరిష్కారం దొరికింది. ఇప్పుడు అంతా సంతోషంగా సాగు చేసుకోవాలని కోరుకుంటున్నా.

– బాలినేని శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే

ఆనందంగా ఉంది



నేను రాజకీయంలోకి వచ్చి 35 సంవత్సరాలైంది. మోటుమాల ప్రజలంతా పేదలు. ఇంటిల్లపాదీ ఉప్పు కొఠారు కెళ్లి సాగుబడి చేసుకుంటేనే వారికి అన్నం. అటువంటి పరిస్థితిలో ఈ భూములను సాగు చేసుకుంటూ జీవనం గడిపేవారు. పట్టాలు రావడానికి నావంతు సహాయ, సహకారం అందించడం ఆనందంగా ఉంది.

– లంకపోతు అంజిరెడ్డి, ఎంపీపీ

అదృష్టంగా భావిస్తున్నాం



మా తాత తల్లిదండ్రుల నుంచి వస్తున్న సమస్యను బాలినేని పరిష్కరించడం అదృష్టంగా భావిస్తున్నాం. సర్పంచ్‌గా పట్టాలు పంపిణీ చేయడంలో పాల్గొంటున్నందుకు సంతోషంగా ఉంది. ఎప్పుడూ బాలినేనికి రుణపడి ఉంటాం.

– కోడూరి గోపి, మోటుమాల సర్పంచ్

బీసీ ఉద్యోగుల అభ్యున్నతికి సహకరించాలి



సమావేశానికి హాజరైన బీసీ సంఘాల నాయకులు

మార్కాపురం టౌన్: బీసీ ఉద్యోగుల అభ్యున్నతికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సహకరించాలని కోఆపరేటివ్ అసిస్టెంట్ రిజిస్ట్రార్ డి. బాలయ్య కోరారు. ఆదివారం మార్కాపురం పట్టణంలోని టీటీడీ కల్యాణ మండపంలో ఉమ్మడి ప్రకాశం జిల్లా బీసీ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల జేఏసీ మహాసభ జరిగింది. ముఖ్య అతిథులుగా హాజరైన హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ పొలిటికల్ సైన్స్ డైరెక్టర్ డాక్టర్ ఇ. వెంకటేష్, హైకోర్టు న్యాయవాది ఎస్ఎస్ఎన్ రాజు యాదవ్, అసిస్టెంట్ ప్రొఫెసర్ కోటేశ్వరరావు మాట్లాడుతూ బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్ కల్పించాలని, క్రీమీలేయర్ విధానాన్ని రద్దుచేయాలని కోరారు. బీసీలకు సమగ్ర కులగణనను కేంద్ర ప్రభుత్వం చేపట్టాలని, మండల కమిషన్ సూచించినట్లుగా బీసీలకు విద్యా, ఉద్యోగ నియామక ప్రవేశాలల్లో 52 శాతం రిజర్వేషన్ కల్పించాలని కోరారు. చట్టసభల్లో జనాభా దామాషా ప్రకారం అన్ని కులాల వారికి రిజర్వేషన్ కల్పించాలని కోరారు. బీసీ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు పీసీ వెంకటేశ్వర్లు జనవరి 3వ తేదీన సావిత్రీబాయి పూలే జయంతిని జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా జరపాలని కోరారు. ఉపాధ్యాయ జేఏసీ సమన్వయ కర్తలు ఎం. రంగనాయకులు, ఎస్. శ్రీనివాసులు మాట్లాడుతూ బీసీలు విద్యా ఉద్యోగ రంగాల్లో రాణించాలంటే చదువొక్కటే మార్గమని తమ పిల్లలను చదివించాలని కోరారు. అన్నం శ్రీనివాసులు, సురేష్, తుమ్మా రవి, టీపీ వెంకటేశ్వర్లు, భాస్కర్, మురళీధర్‌రావు, వి. సుబ్బారావు, సుధాకర్, ఎంఈఓ టి. శ్రీనివాసులు మాట్లాడారు.

పశ్చిమ మణిహారం వెలిగొండ



సుంకేసులలో మాట్లాడుతున్న తాటిపర్తి చంద్రశేఖర్

పెద్దారవీడు: జలయజ్ఞ దాత, అపరభగీరథుడు దివంగత సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి వెలిగొండ ప్రాజెక్టును పశ్చిమ ప్రాంతానికి మణిహారంగా తీర్చిదిద్దారని వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి తాటిపర్తి చంద్రశేఖర్ పేర్కొన్నారు. సుంకేసుల ఎస్సీ కాలనీలో జనవరిలో జరిగే పండగ సందర్భంగా పాటకచేరీని శనివారం రాత్రి ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రాజెక్టును ప్రారంభించడంతో పాటు భారీగా నిధులు మంజూరు చేశారన్నారు. ప్రాజెక్టు నిర్మాణానికి ముంపు గ్రామాల ప్రజలు ఎంతో త్యాగం చేశారని, ఇక్కడ ఉన్న అనుబంధాలు, గడ్డని వదులుకొని ప్రాజెక్టుకు అంకితం చేసి వెళుతున్న ప్రజలకు తన పాదాభివందనాలని తెలిపారు. ఎర్రగొండపాలెం నియోజకవర్గం సాగు, తాగునీరు లేని ప్రాంతమని, ఈ ప్రాజెక్టును పూర్తి చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉండాలని కొనియాడారు. మాట తప్పని.. మడిమ తిప్పని నాయకుడు జగనన్నే అన్నారు. టన్నెల్ తవ్వకంలో టీడీపీ నాయకులు, దళారులు, పెత్తందారులు దోపిడీ చేసి, వెలిగొండను ఏటీఎంలా వాడుకున్నారన్నారు. మొత్తం 37 కిలోమీటర్లకు గాను రెండో టన్నెల్లో.. 5 ఏళ్లలో కేవలంలో ఆరున్నర కిలో మీటర్ల మాత్రమే పని చేశారని ఎద్దేవా చేశారు. వెలిగొండలో ఆసియా ఖండంలోనే నీటి పారుదల అతి పెద్ద రెండు టన్నెల్స్ ఉంటే.. దాదాపు 30 కిలో మీటర్ల సొరంగాన్ని తవివ్వన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. ఇంతటి అద్భుతమైన ప్రాజెక్టును రాష్ట్ర ప్రజలకు అంకితం చేస్తున్న ప్రభుత్వాన్ని విమర్శించే నైతిక హక్కు టీడీపీ నాయకులకు లేదన్నారు. మూడు జిల్లాల్లో వ్యవసాయానికి 4.50 లక్షల ఎకరాలు సాగు నీరు, 15.30 లక్షల మందికి తాగునీరు అందించే ప్రాజెక్టు అన్నారు. ఈ ప్రాంత వనరులను, స్థలాలను, అనుమతులను, ఎగువ రాష్ట్రాల్లో ఉన్న ఇబ్బందులను తొలగించిన మహానేత డాక్టర్ రాజశేఖరరెడ్డి అన్నారు. టీడీపీ నాయకులతో పాటు నిన్న వచ్చిన ఇన్‌చార్జి అయితే అవివేకం, అజ్ఞానంతో మాట్లాడుతున్నారని, టీడీపీ అంటే ఒక విషం, విద్వేషం, చిచ్చు, రచ్చ అని స్పష్టం చేశారు. వైఎస్సార్ సీపీ అంటే నినాదం, నవసామాజిక నిర్మాణానికి నిటారని, అన్ని వర్గాల సమూహమన్నారు. రాష్ట్రంలో మంచి పరిపాలన అందిస్తున్న వైఎస్సార్ సీపీని మరోసారి ఆశీర్వదించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ గుడ్డెపోగు రమేష్, ఏపీ ఇరిగేషన్ డైరెక్టర్, మాజీ జెడ్పీటీసీ దుగ్గెంపుడి వెంకటరెడ్డి, ఎంపీపీ బెజవాడ పెద్దగురవయ్య, పార్టీ మండల ఉపాధ్యక్షులు తోకల ఆవులయ్య యాదవ్, ఉప సర్పంచ్ కోటకొండ కోటేశ్వరరావు, సర్పంచులు పాలగిరి రామాంజనేయులు, అంగిరేకుల ఆదినారాయణ, సచివాలయ కన్వీనర్ గుడ్డెపోగు వెంకట సుబ్బయ్య, పార్టీ జిల్లా ఎస్సీసెల్ జాయింట్ సెక్రటరీ పంది గురవయ్య, మండల కమిటీ సభ్యులు గుర్రం ముత్యాలయ్య, నాయకులు వెన్నా శివకృష్ణారెడ్డి, షేక్ బుజ్జీ, కొర్ర కీరానాయక్, ఎం. రామస్వామిరెడ్డి, ఏరువ సహదేవుడు, ఇండ్లా భాస్కరరెడ్డి, అవుల నాగిరెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ముండ్లమూరు: మండలంలోని శంకరాపురం గ్రామానికి చెందిన జక్కుల వెంకటేశ్వర్లు (56) గుంటూరు ఎన్ఆర్ఐ హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందాడు. ఆదివారం భార్య రమణమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ పవన్‌కుమార్ తెలిపారు. నూజిళ్లపల్లి వద్ద ఈ నెల 16న ద్విచక్ర వాహనంపై వెళ్తున్న జక్కుల వెంకటేశ్వర్లు రోడ్డుపై ఉన్న మట్టి కుప్పపై ద్విచక్ర వాహనం ఎక్కించడంతో అదును తప్పి బోల్తా పడ్డాడు. ఈ ప్రమాదంలో గాయాలు కాగా 108 వాహనంలో అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు, అనంతరం గుంటూరుకు తరలించారు.

విద్యుత్ షాక్‌తో బాలుడికి తీవ్ర గాయాలు



విద్యుత్ షాక్‌తో గాయపడిన బాలుడు

దొనకొండ: తోటి పిల్లలతో ఆడుకుంటూ అకస్మాత్తుగా విద్యుత్ షాక్‌కు గురై బాలుడికి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలోని బాదాపురం గ్రామంలో ఆదివారం జరిగింది. నూతనంగా నిర్మిస్తున్న పాఠశాల భవనంపై పిల్లలు ఎక్కి సరదాగా ఆడుకుంటున్న క్రమంలో బిందెల బాల కోటయ్య కుమారుడు చరణ్ అనే బాలునికి సమీపంలో ఉన్న విద్యుత్ తీగలు తగలడంతో కింద పడిపోయాడు. గుర్తించిన బంధువులు 108కు సమాచారం అందించారు. సిబ్బంది వెలుగొండయ్య, పైలట్ ప్రసాద్ సంఘటనా స్థలానికి చేరుకుని ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం నిమిత్తం కోసం వినుకొండ తీసుకెళ్లారు.

రాష్ట్ర స్థాయి ఎడ్ల బండలాగుడు పోటీలు

కురిచేడు: మండలంలోని పొట్లపాడు గ్రామంలో ఆదివారం జరుగుతున్న గుత్తికొండ రామయోగి తాత ఆరాధన ఉత్సవాల సందర్భంగా 29, 30 తేదీల్లో రాష్ట్ర స్థాయి బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 4 పళ్ల విభాగంలో బహుమతులు 1 నుంచి 9 వరకు వరుసగా రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.25 వేలు, రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.12 వేలు, రూ.10 వేలు, రూ.7 వేలు, రూ.5 వేలు, న్యూ కేటగిరీ విభాగంలో 1 నుంచి 9 వరకు వరుసగా రూ.50 వేలు, రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.25 వేలు, రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.12 వేలు, రూ.10 వేలు, రూ.5 వేలు దాతల సహకారంతో ఇస్తున్నట్లు నిర్వహకులు తెలిపారు.

రబీ ఈ-క్రాప్‌ను వేగవంతం చేయాలి

● జేడీఏ శ్రీనివాసరావు

ఒంగోలు సెంట్రల్: రబీ ఈ–క్రాప్ నమోదు వేగవంతం చేయాలని వ్యవసాయశాఖ జేడీఏ శ్రీనివాసరావు కోరారు. ఫిబ్రవరి 15లోపు వ్యవసాయశాఖ సిబ్బంది ఈ–క్రాప్ నమోదు, ఈ కేవైసీ పూర్తి చేయాలన్నారు. ఫిబ్రవరి 21 నుంచి 28 వరకు ఆర్‌బీకేలలో సోషల్ ఆడిట్ జరుగుతుందని, మార్చి ఒకటి నుంచి నాలుగు వరకు సోషల్ అడిట్ గ్రీవెన్స్ నిర్వహిస్తారని చెప్పారు. మార్చి 6న రబీ ఈ–క్రాప్ ఫైనల్ జాబితా తయారవుతుందని తెలిపారు.

భక్తి శ్రద్ధలతో యోగి తాత ఆరాధన



శ్రీ గుత్తికొండ రామయోగితాత జీవ సమాధి

పొట్లపాడు (కురిచేడు): మండలంలోని పొట్లపాడు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీగుత్తికొండ రామయోగి తాత ఆరాధన అత్యంత భక్తి శ్రద్ధలతో ఆదివారం జరుపుకున్నారు. మూడు రోజులపాటు జరిగే ఈ ఆరాధన కార్యక్రమాలకు రాష్ట్రంతో పాటు తెలంగాణ, కర్ణాటక నుంచి కూడా పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. భక్తుల సౌకర్యార్థం తాగునీరు, అన్నదాన కార్యక్రమాలను ఆలయ నిర్వహణ కమిటీ ఏర్పాటు చేసింది. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన వారు శ్రీ గుత్తికొండ రామయోగి తాతకు, శ్రీ బాలాత్రిపురసుందరీ దేవికి మొక్కులు తీర్చుకున్నారు. గ్రామస్తులు మూడో రోజు మంగళవారం గురుపూజ నిర్వహిస్తారు. దీంతో ఆరాధన కార్యక్రమాలు ముగుస్తాయి. మహిళలు పొంగళ్లు తయారు చేసి నైవేద్యం సమర్పించారు. సంతానం లేని మహిళలు స్వామి వద్ద ఉపవాసదీక్షతో తడిబట్టలతో వరపడితే వారికి సంతానం కలుగుతుందని భక్తుల నమ్మకం. అలా సంతానం కలిగిన వారందరికీ స్వామిపేరు కలిసి వచ్చేలా నామకరణం చేసుకోవటం ఆనవాయితీగా వస్తోంది. రాత్రి 2 గంటలకు స్వామి వారి చిత్రపటం రథోత్సవం గ్రామంలో నిర్వహిస్తారు. ఆదివారం రాత్రికి విద్యుత్ ప్రభలు నిర్మించి సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు.



స్వామివారి చిత్రపటం



దర్శనం కోసం బారులుతీరిన భక్తులు



సంతానం కోసం వరపడుతున్న మహిళలు



పొంగళ్లు చేస్తున్న మహిళలు



అన్నదానం చేస్తున్న ఆలయ నిర్వహణ సభ్యులు